నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I హైదరాబాద్, శుక్రవారం 6 డిసెంబర్ 2024 HYDERABAD




గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తూ.. గిగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్సీ కవితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, సోమేష్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-సిటీబ్యూరో

## పారదర్శకంగా ఇండ్లు కేటాయిస్తాం

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కలెక్టరేట్‌లో గురువారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్ లు హైదరాబాద్ జిల్లాకు చెందిన 81 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ఇండ్లు కేటాయిస్తామని చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో పేదలకు అందించే ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేసేందుకు అధికారులు వస్తారని సమాచారం అందించాలని సూచించారు. అనంతరం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ స్లమ్‌ల్లో ఇందిరమ్మ ఇండ్ల సంఖ్యను పెంచేలా ప్రత్యేక ప్రాధాన్యత నిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రశ్నిస్తే జైలు.. నిరసిస్తే నిర్బంధం

## ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులపై భగ్గుమన్న బీఆర్ఎస్



గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి తదితరులు



గచ్చిబౌలి పీఎస్ ముందు నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సిటీబ్యూరో: ముఖ్యమంత్రి, ఇంటెలిజెన్స్ చీఫ్‌లపైనే ఫోన్ ట్యాంపింగ్ ఆరోపణలు చేస్తారా? వాళ్లు ఏదైనా చేస్తారు..? వాళ్లపై ఫిర్యాదు ఇవ్వడానికి మీకెంత ధైర్యం అన్నట్లు హైదరాబాద్ పోలీసులు వ్యవహరిస్తూ.. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారంటూ.. నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యేకే ఈ పరిస్థితి ఉంటే సామాన్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ధైర్యంగా ఫిర్యాదు ఇవ్వగలరా? అంటూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కౌశిక్‌రెడ్డితో పాటు ఆయన అరెస్టును ఖండిస్తూ అక్రమ అరెస్టును అడ్డుకోవడానికి ప్రయత్నించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును అరెస్టు చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. కౌశిక్‌రెడ్డి అక్రమ అరెస్టును నిలదీసినందుకు హరీశ్‌రావు, మాజీ మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తదితర నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై నగర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి. ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులపై కక్ష్యపూరిత చర్యలకు పాల్పడుతున్నదని, ప్రజా పాలన అంటూ ఓవైపు చెబుతూ మరో వైపు ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు.

### కేసు నమోదు వెంటనే అరెస్టు..

కౌశిక్‌రెడ్డిపై బుధవారం రాత్రి అక్రమ కేసును బనాయించిన బంజారాహిల్స్ పోలీసులు, గురువారం తెల్లవారుజామునే ఆయనను అరెస్టు చేసేందుకు వెళ్లడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. ఒక ఎమ్మెల్యే వస్తే పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు తీసుకోకుండా తప్పించుకుపోయే ప్రయత్నం చేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. తమ ఉన్నతాధికారులపై వచ్చే ఫిర్యాదులను తామేలా తీసుకోవాలనే భావనతో అటు ఏసీపీ, ఇటు ఇన్‌స్పెక్టర్ తమ కార్యాలయాల నుంచి జారుకోవడానికి ప్రయత్నించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఫిర్యాదు తీసుకోవాలన్న పాపానికి పోలీసులు, ఫిర్యాదుదారుడిపైనే కేసులు నమోదు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు నిదర్శనంగా ఉందంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు చట్టం ప్రకారం కాకుండా రేవంత్ ప్రత్యేక చట్టం ప్రకారం పని చేస్తున్నారంటూ విమర్శిస్తున్నారు.

### ఎమ్మెల్యే ఫిర్యాదుపైనే స్పందించకుంటే..

ఒక ఎమ్మెల్యే ఫిర్యాదుపైనే పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడితే.. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులు చేసే అన్యాయాలు, అక్రమాలపై సామాన్య ప్రజలు ఫిర్యాదు ఇవ్వడానికి ముందుకు వస్తారా? అని సామాన్య ప్రజలు చర్చించుకుంటున్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఎమ్మెల్యేపైనే పోలీసులు కేసు నమోదు చేశారు, ఇదే భయాన్ని సామాన్యులకు కూడా ఉంచాలని రేవంత్ సర్కార్ పక్కా ప్లాన్‌తో ఈ కేసు నమోదు చేయించి, కౌశిక్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేసిందంటూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



బీఆర్ఎస్ శ్రేణుల అరెస్టు



గచ్చిబౌలి పీఎస్ వద్ద మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్..



బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసుల జులుం



మహిళల నిరసన



అక్రమ అరెస్టులను ఖండిస్తూ..

# తప్పు ఎవరిది? శిక్ష ఎవరికి?

- పర్మిషన్ ఉన్న స్థలంలోకి బుల్డోజర్లు
- అక్రమార్కుడికి అండగా నిలుస్తున్న శేరిలింగంపల్లి జోన్ అధికారులు
- అధికార పార్టీ ఎమ్మెల్యే సహకారంతో ప్లాట్‌ను కబ్జా చేసేందుకు బిల్డర్ యత్నం
- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనా.. ఆగని దౌర్జన్యం
- గచ్చిబౌలి ఎఫ్‌సీఐ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కేంద్రంగా దుర్మార్గం
- అధికారుల తీరు చర్చనీయాంశం

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : కాయ కష్టం చేసుకుని పైసా..పైసా కూడబెట్టి..ఇంటి కలను నెరవేర్చుకునేందుకు అనుమతి తీసుకుని ఇంటి నిర్మాణ పనులు మొదలు పెడితే.. వివాదాస్పద బిల్డర్ ఆ స్థలంపై కన్నేశాడు. కబ్జాకోరు, వివాదాస్పద బిల్డర్ అయిన సంధ్య కన్‌స్ట్రక్షన్స్ ఎండీ సరనాల శ్రీధర్‌రావు ఇందుకు రంగారెడ్డి జిల్లాలోని సీనియర్ ఎమ్మెల్యే సహకారం తీసుకొని బలవంతంగా లాగేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. నిర్మాణ జరుగుతున్న ప్లాట్‌లోకి అక్రమంగా చొరబడి, అందులో ఉన్న సామగ్రిని ధ్వంసం చేసి ప్లాటు కబ్జాకు యత్నించడంపై సదరు శ్రీధర్ రావుపై ఇటీవల గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అయినా వెనక్కి తగ్గకుండా శ్రీధర్, అధికార పార్టీ ఎమ్మెల్యేతో కలిసి అధికారులపై ఒత్తిడి పెంచి మరీ ఈ స్థలంలో నిర్మాణ పనులకు అడుగడుగునా అడ్డుతగులుతుండడం గమనార్హం. వాస్తవం ఏమిటంటే అధికారులు సైతం అక్రమార్కుడికి కొమ్ముకాస్తూ అమాయక నిర్మాణదారుడి స్థలంపై బుల్డోజర్లు దింపడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే...గచ్చిబౌలి ఎఫ్‌సీఐ ఎంప్లాయిస్ కాలనీ సర్వే నంబర్ 124,125, ప్లాట్ నంబర్ 84లోని 708 గజాల స్థలంలో వి. దేవరాజ్, వి. కల్యాణిల పేరుతో జీహెచ్ఎంసీకి నిర్మాణ అనుమతికి 2022లో దరఖాస్తు చేసుకున్నారు. స్థలం డాక్యుమెంట్లు, పర్మిషన్‌కు సంబంధించి సిల్ట్ + 5 అంతస్తుల నిర్మాణానికి ప్లాన్ పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణానికి అనుమతి మంజూరు చేశారు. పర్మిట్ నంబర్ 2046/జీహెచ్ఎంసీ/ఎస్ఎల్‌పీ/2022(ఫైల్ నం. 005050) పేరుతో ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అనుమతి రాగానే సదరు నిర్మాణదారుడు దేవరాజ్ ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ ఎఫ్‌సీఐ కాలనీ హౌసింగ్ సొసైటీపై పెత్తనం చెలాయిస్తున్న బిల్డర్ శ్రీధర్ రావు బలవంతంగా దేవరాజ్ స్థలాన్ని తీసుకునే కుట్రకు తెరలేపాడు. దేవరాజ్‌ను పలు విధాల ఒత్తిళ్లు పెంచి మానసిక క్షోభకు గురి చేశాడు. అనేకసార్లు ప్లాట్‌లోకి చొరబడి నిర్మాణ సామగ్రికి చల్లాచెదురు చేశాడు. ఈ నేపథ్యంలో గత నెల 27న శ్రీధర్ రావుపై దేవరాజ్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, వెంటనే కేసు నమోదు చేయడం జరిగింది. అయినప్పటికీ శ్రీధర్‌రావు వెనక్కి తగ్గకుండా గురువారం అధికార పార్టీ ఎమ్మెల్యే సహకారంతో శేరిలింగంపల్లి ముఖ్య అధికారులపై ఒత్తిడి పెంచి నిర్మాణ స్థలంలో ఫెన్సింగ్‌ను జేసీబీతో తొలగించారు. ఇదేక్కడి అన్యాయమని టౌన్‌ప్లానింగ్ అధికారులను నిర్మాణదారు డు దేవరాజ్ ప్రశ్నిస్తే స్థలం విషయంలో ఫిర్యాదు వచ్చిందని చెబుతున్నారని, ఆ ఫిర్యాదు చేసిందెవరూ? దానికి వివరాలు ఇస్తానని, అనుమతి ఇచ్చిన మీరే పనులకు అడ్డు తగలడం ఏమిటని దేవరాజ్ మాటలకు అధికారుల నుంచి సమాధానం లేకపోవడం గమనార్హం.

### సర్వత్రా విమర్శలు..

మున్సిపల్ నిబంధనల ప్రకారం తనకున్న 708 గజాల స్థలానికి అనుమతిని పొందిన తర్వాత కూల్చివేయడంపై అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటి నిర్మాణం అక్రమంగా చేపడితే ముందస్తుగా నోటీసులు ఇవ్వాలని అధికారులకు తెలియదా? ఎందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు? అధికారులపై రాజకీయ పరమైన ఒత్తిడిలు ఉంటే అనుమతితో నిర్మాణం చేపడుతున్న వాటిపై చర్యలు ఎందుకు తీసుకుంటున్నారు? ఇంటి అనుమతులిచ్చేటప్పుడు పత్రాలను, స్థలాన్ని చూడకుండానే ఇచ్చారా? స్థలంపై వివాదం ఉంటే అనుమతి ఎందుకు ఇచ్చారు? తప్పు ఎవరు చేస్తే శిక్ష ఎవరికి వేస్తున్నారు? అధికారులు ఎందుకు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ జోరుగా జరుగుతున్నది.



## ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేశా

**- దేవరాజ్**

పైసా పైసా పోగు చేసుకుని నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపడుతుంటే అధికారులు తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అక్రమార్కులకు అండగా నిలుస్తూ తన స్థలాన్ని తనకు కాకుండా చేస్తున్నారని దేవరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, నిర్మాణ పర్మిషన్ కాపీలతో జీహెచ్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా ఇంటి పనులు మొదలు పెడితే కూల్చివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనుమతి ఉన్నా ఎందుకు కూల్చివేస్తున్నారని ప్రశ్నిస్తే ల్యాండ్ విషయంలో ఫిర్యాదు వచ్చిందని చెబుతున్నారే తప్ప.. అసలు ఫిర్యాదుదారుడి వివరాలు చెప్పమని ఆడిగితే అధికారులు ఎందుకు చెప్పడం లేదన్నారు. అనుమతి పత్రాలు వారికి చూపించినా.. అవేం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాలని మండిపడ్డారు. తనకు న్యాయం జరిగే వరకు కుటుంబ సభ్యులతో కలిసి పోరాటం చేస్తానని, కమిషనర్ ఇలంబర్తి తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని దేవరాజ్ విజ్ఞప్తి చేశారు. తనకు ప్రాణహాని ఉందని సీపీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## శ్రీధర్‌రావుపై గచ్చిబౌలిలో కేసు నమోదు

సంధ్య కన్‌స్ట్రక్షన్స్ ఎండీ సరనాల శ్రీధర్‌రావు మీద గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నంబర్ 124, 125లలోని ఎఫ్‌సీఐ కాలనీలో గల ప్లాట్ నంబర్ 84లో 700ల గజాల స్థలాన్ని గతకొన్ని సంవత్సరాల కిందట కొనుగోలు చేసిన ఉమా దేవరాజు అనే మహిళ, అప్పటి నుంచి పొజిషన్‌లో ఉండగా, అక్రమంగా ప్లాట్‌లోకి అక్రమంగా చొరబడి కబ్జా యత్నించినందుకు కేసు నమోదు చేశారు. ఖాజాగూడ భగీరథమ్మ చెరువులో మట్టి డంపింగ్ చేసి చెరువును పూడ్చేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో రాయదుర్గం పోలీసులు శ్రీధర్‌రావుపై మరో కేసు నమోదు చేశారు. బాధితుడు దేవరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు శ్రీధర్ రావు, అతడి అనుచరులు వెంకటేశ్, సాయికుమార్‌రెడ్డిపై బీఎన్ఎస్ సెక్షన్ 329/3, 324/4, 351/2, రెడ్‌విత్ 3,5ల కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.